
# కన్నె ముత్తైదువులు

హిందీమూలం: మృణాల్ పాండే

అంగ్లానువాదం— రమా బారు

తెలుగు అనువాదం— వేమన వసంతలక్ష్మి



ఉత్తర భారతదేశంలో చైత్ర శుక్ల అష్టమినాడు ఆడపిల్లల్ని కన్యా దేవతలుగా పూజించే సాంప్రదాయం వుంది. ఈ పండుగ మార్చి లేదా ఏప్రిల్‌లో వస్తుంది. మన వైపు అలాంటి పండుగ ఏమీ లేదు కాని ఏ పేరంటానికి వెళ్ళినా కన్నెపిల్లల్ని కన్నె ముత్తయిదువులుగా చూసి పసుపు, కుంకుమ, తాంబూలం ఇస్తారు. వాళ్ళు ఎదురు రావడం శుభ శకునంగా భావిస్తారు. ఒకవైపు అలా చూస్తూనే మరో వైపు ఆడపిల్లల్ని గుండెల మీద కుంపటిగా భావిస్తారు. ఈ ద్వంద్వ విలువల మీద కోపంతో మృణాల్ పాండే రాసిన కథ ఇది (1983). మృణాల్ పాండే 'హిందుస్తాన్ టైమ్స్' వారి హిందీ దినపత్రిక 'సప్తాహిక్ హిందూస్తాన్'కి సంపాదకురాలుగా పని చేస్తున్నారు. ఇంకా చాలా కథలు, నాటకాలు, నవలలు రాశారు.

అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్ళే రోజున నాన్న మంచి నీళ్ళ కూజా పగలగొట్టాడు. కావాలనే పగల గొట్టాడో లేక చెయ్యి జారిందో తెలియదుగాని గదంతా నీళ్ళ మయం. అమ్మ చీర కుచ్చిళ్ళు ఎత్తి పట్టుకుని తలుపు చాటున నక్కిన పనిమనిషిని పిలిచింది గుడ్డ తీసుకు రమ్మని. తడినేల మీద ఎవరైనా కాలుజారి పడి ఎముకలు విరగ్గొట్టుకుంటే మళ్ళీ అదో సమస్య.

అమ్మకు జీవితంలో అన్నీ సమస్యలే. మేము ఇంట్లో వున్నా, బళ్ళో వున్నా, ఒంట్లో బాగోకపోయినా, వూరికే ఆడుకుంటూ వున్నా మా అమ్మకు మేము సమస్యలమే. "మళ్ళీ మూడు నెలల దాకా రారు కదమ్మా మీరు?" పనిమనిషి అమ్మను అడిగింది. "అవును. ఈ లోపల రానివ్వరు వాళ్ళు" అని నా వైపుకి తిరిగి బయటికెళ్ళి ఆడుకోమని ఆర్డరిచ్చింది.

అదేం ఖర్మో నేనెప్పుడూ వుండకూడని చోట, వుండ కూడని టైమ్‌లోనే వుండేట్టున్నాను. పగిలిన కూజా ముక్కను నోట్లో పెట్టుకుని చప్పరిస్తూ నేను బయటికి వెళుతుండగా "ఈసారయినా అబ్బాయి పుడితే బాగుండు. ఇంకో కాన్పు కష్టం తప్పుతుంది" అమ్మ పనిమనిషితో అనడం వినిపించింది. "అంతే...అంతే..." అని ఆవిడ బహుశా సమాధానం చెప్పి వుంటుంది.

స్టేషన్‌లో రైలు ఆగగానే అందర్నీ తోసుకుంటూ గబగబా పెట్టెలో దూరి కిటికీ పక్క సీటు సంపాదించాను. నాలుక బయట పెట్టి "ఏ...ఏ..." అని అరుస్తూ అందరి వంకా విజయగర్వంతో చూశాను. అమ్మ చూపు నా మీద పడబోతోందని గ్రహించి వెంటనే 'ఎ...ఎలుక, ఏ...ఏనుగు' అని పాఠం వల్లె వేయడం మొదలు పెట్టాను. అమ్మ నిజానికి నా వంక చూడడం లేదు. బండెడు సామాను, కూజా, ముగ్గురు పిల్లలు, నిండు నెలల గర్భం—వాటన్నిటినీ జాగ్రత్తగా చూసుకోవడంలో నిమగ్నమై వుంది. ఒక స్టేషన్‌లో రైలాగినపుడు అమ్మ సమోసాలు కొని పెట్టింది. కాని పక్క కిటికీలోంచి ఒక చిన్న పిల్లాడు ఉచ్చ పోస్తుండడం చూసి నాకు ఆ సమోసా తినబుద్ధి కాలేదు. అమ్మకిచ్చేసి సీటు మీద పడిపోయిన ఒక బంగాళా దుంప ముక్కను పురుగులాగా చేసి మా చెల్లిని భయ పెట్టాను. అది బావురుమంది. అమ్మ నన్ను నాలుగు దెబ్బలు వేయడంతో నేనూ ఏడుపుకి లంకించుకున్నాను. మా అక్క విసుక్కుంది. "నువ్వు ఎప్పుడూ ఏదో ఒక గొడవ తెచ్చి పెడ్తావే"

## తెల్ల మచ్చలకు చికిత్స

శక్తివంతమైన, అద్భుతమైన మా ఆయుర్వేద చికిత్సను ప్రారంభించిన 36 గంటలలోనే మచ్చల రంగు మారడం ప్రారంభమవుతుంది. త్వరలోనే మామూలు శరీరపు రంగుకు చేరుకుంటాయి. ఒకసారి ఈ చికిత్స ప్రయత్నించి చూడండి. ఫలితాలతో తప్పక సంతృప్తి చెందుతారు. చికిత్స నిమిత్తం మీ వ్యాధి యొక్క పూర్తి వివరాలను వ్రాయండి, ఒక ప్యాకెట్ మందును ఉచితంగా పొందండి.

**Parag Clinic** (A/21) P.O. Katri Sarai (Gaya)

## తెల్లజుట్టు నల్లబడడానికి చికిత్స

మా చికిత్స బాలనెరుపు, జుట్టు రాలటాన్ని నివారించి, తెల్లబడ్డ జుట్టును సహజసిద్ధమైన నలుపు రంగుకు వచ్చేటట్టు చేస్తుంది. మృదువైన పొడుగాటి వెంట్రుకలకు, మెదడును చల్లగా వుంచటానికి దోహదపడుతుంది. కండ్ల బలహీనతలకు ఎంతో మేలైనది. ధర ఒక కోర్సుకు రూ.80/-. పోస్టేజి మరియు ప్యాకింగ్ అదనం.

**Parag Clinic** (A/65) P.O. Katri Sarai (Gaya)

## సంతోషప్రదమైన వైవాహిక జీవితం

ఏ కారణం వల్లనైనా మీ వైవాహిక జీవితం ఆనందప్రదంగా లేకపోతే, సిగ్గుతోనో, భయంవల్లనో మీ సెక్స్ వ్యాధులను దాచుకోవటానికి ప్రయత్నించకండి. చికిత్స నిమిత్తం మీ వ్యాధి పూర్తి వివరాలను మాకు వ్రాయండి. వైవాహిక జీవితంలోని ఆనందాన్ని అనుభవించండి.

**Parag Clinic** (A/GR) P.O. Katri Sarai (Gaya)

## అపూర్వ శక్తిగల ఉంగరం

మీరు ఇప్పుడు నిరాశ చెందకండి. శుభ ముహూర్తంలో గ్రహానుసారం తయారుచేయబడిన ఈ తాంత్రిక ఉంగరం ధరించడం వలన కోరుకున్న స్త్రీ లేదా పురుషుని వశం చేసుకునే వీలుంది. కఠిన హృదయులు కూడా మీ వశంలోనికి వచ్చి, మీ అడుగుజాడలలో నడుచుకుంటూ మీ ఆజ్ఞను శిరసావహిస్తారు. ఇష్టపడినవారితో వివాహం జరుగుతుంది. ఉద్యోగం దొరుకుతుంది. ప్రేతాత్మలతో మాట్లాడవచ్చు. కోర్టులో గెలిచే అవకాశం వుంది. పరీక్షలలో ఉత్తీర్ణులవ్వవచ్చును. వ్యాపారంలోలాభం వస్తుంది. దుష్ట గ్రహాలు శాంతిస్తాయి. జీవితం సుఖ శాంతులతో నడుస్తుంది.

ఈ తాంత్రిక ఉంగరం యొక్క వెల రూ.31/-. 24 గంటలలో వెంటనే ప్రభావం చూపిస్తుంది. మీ పేరు ప్రకారం అష్ట ధాతువులతో తయారుచేయబడుతుంది. చాందీ వారి ప్రత్యేక సికిందర్ ఉంగరం వెల రూ.151/-. తపాలా ఖర్చులు అదనంగా చెల్లించవలసి వుంటుంది. ఈ ఉంగరాల ప్రభావం ఎప్పుడూ తప్పుగా పనిచేయదు. వీటి ప్రభావం సరిగా కనుక లేకుంటే మీరు చెల్లించిన మూల్యానికి రెట్టింపు వాపసు చేయబడుతుంది. ఇది వాస్తవం కాదని నిరూపించగలిగినట్లయితే అట్టివారికి రూ.1000/- నగదు రూపంలో ఇవ్వబడుతుంది. ఒకసారి వాడి చూడండి. మీకే తెలుస్తుంది.

**V.P.P.** ద్వారా తెప్పించుకునే చిరునామా:

**KABAIR ASHRAM** (AJ/91)
P.O. Malra Barith (Gaya)

అని. అయినా దానికొక్క దానికే నేనంటే నిజంగా ఇష్టం. మిగతా వాళ్ళెవరూ మంచాళ్ళు కారు.

మామయ్య, అత్తమ్మ వచ్చారు స్టేషన్‌కి. జీపులో ఇంటికి వెళ్ళేటపుడు డ్రైవరు హారను వేసినప్పుడల్లా మేము ముగ్గురం కూడా బాయ్‌మని అరుస్తూనే వున్నాం. డ్రైవర్‌కు మా అరుపులు నచ్చినట్టున్నాయి. ఇల్లు చేరగానే నన్ను, మా చెల్లిని తనే కిందికి దింపాడు. ఈలోగా కూజా మళ్ళీ పడిపోయి నీళ్ళన్నీ కారిపోయాయి. పొద్దున్న ఇంటి దగ్గర పగిలి పోయిన కూజా, దానితోపాటు నాన్న గుర్తురావడంతో నేను ఆ ధ్యాసలో పడి పొరపాటున చెల్లి కాలు తొక్కాను. అది దాదాపు పడిపోబోయింది. వెంటనే వెనక నుంచి అమ్మ కోపాన్ని గొంతులో అదిమి పెడుతూ "నా కష్టాలన్నిటికీ నువ్వేనే కారణం" అని తిట్టి నా చెయ్యి గట్టిగా పుచ్చుకుని లోపలికి తీసికెళ్ళింది.

మేము ఎప్పుడు అమ్మమ్మ వాళ్ళింటికి వచ్చినా నాన్న మాతోపాటు రాడు. అమ్మ ఇక్కడికి వస్తే చాలు అమ్మమ్మలతో, అత్తలతో, పిన్నులతో కబుర్లు చెప్పడమే సరిపోతుంది. పగటిపూట ఎప్పుడయినా తన దగ్గరికి వెళ్ళబోతే ఎవరో ఒకరు వెంటనే "పాపం ఇక్కడయినా తనని కాస్త విశ్రాంతిగా వుండనీయండే" అనేస్తారు. అక్కడికి మేమేదో తనని ఎప్పుడూ వేధించుకు తింటున్నట్టు. అమ్మ కూడా అలాగే జాలిగా మొహం పెట్టుకుని చూస్తుంటుంది. అదంతా గుర్తొచ్చి ఇంట్లోకి వెళ్ళబుద్ధికాక బయటి మొక్కల దగ్గరే కాసేపు తచ్చాడాను. ఒక కుక్క వచ్చి నన్ను వాసన చూసింది. "ఈలోగా ఈ పిల్ల ఎక్కడికి మాయమైంది?" ఇంట్లోంచి ఎవరిదో గొంతు వినిపించింది.

కుక్కతో పాటు నేను ఇంట్లోకి వెళ్ళే సరికి అమ్మమ్మ మామయ్య కొడుకుని ఒళ్ళో కూర్చోపెట్టుకుని కనిపించింది. ఏ జంతువైనా మా అమ్మమ్మకి అంటరానిదే కనుక కుక్కని వెంటనే బయటికి తరిమేసింది. దానికి అది అలవాటే కాబట్టి తోక ముడుచుకుని వెళ్ళిపోయింది. ఎవరో నన్ను వొంగి అమ్మమ్మ కాళ్ళకు దణ్ణం పెట్టమని చెప్పారు. "అలా కాదు...సరిగ్గా వొంగు. ఆడపిల్లలు జీవితమంతా వొంగుతూనే బతకాలి కాబట్టి అదేదో ఇప్పుడే సరిగ్గా నేర్చుకోవడం మంచిది..." మా అత్తమ్మ కాబోలు అంది. అమ్మమ్మ చెయ్యెత్తి నన్ను ఆశీర్వదిస్తూ "ఈ పిల్ల పొడుగెక్కలేదు. దీనికి ఎనిమిది ఏళ్ళంటే ఎవరు నమ్ముతారు?" అంది.

గిచ్చుతున్నా పట్టించుకోకుండా మామయ్య కొడుకు నా వెనకే తిరగడం మొదలు పెట్టాడు. తెల్లగా బొద్దుగా పొడుగ్గా వున్నాడు వాడు. ముద్దుగా వుంటాడంటారు అందరూ. "రాత్రికి కథ చెప్పవా నాకు" అని అడుగుతుంటే చెప్పనని పేపర్ పట్టుకుని చదువుతున్నట్టు నటించాను.

"ఈ బాధ పడలేను బాబో" అని మా అమ్మ గొణుగుతూనే వుంది. అమ్మను చూడ్డానికి వచ్చిన పక్కింటి ముసలమ్మ "లాలికి ఈసారి ఖచ్చితంగా అబ్బాయే పుడతాడు. ఇంతకు ముందు ఆడపిల్లల్ని కడుపుతో వున్నపుడు ఎర్ర రంగులో వుండేది. ఇప్పుడు చర్మం పచ్చ రంగులో వుంది. సందేహం లేదు. ఈ సారి అబ్బాయే" అని అమ్మమ్మతో అనేసి కూర్చుంది.

"ఏమో ఎవరు చూడొచ్చారు! ఈసారీ..." అమ్మ జాలిగా మొహం

పెట్టి గోళ్ళు కత్తిరించుకుంటూ కూర్చుంది.

"మీ ఆయనకి వంట చేసి పెట్టడానికి ఎవరైనా వున్నారా?" అడిగిం దావిడ. నాకు మళ్ళీ నాన్న గుర్తొచ్చాడు. నాన్న దగ్గర మంచి వాసన వచ్చేది. ఒళ్ళో పడుకుంటే ఎంతో మెత్తగా వుండేది. ఇక్కడికి వచ్చిన పుడు అమ్మ మమ్మల్ని ఎక్కువ సేపు తన ఒళ్ళో పడుకోబెట్టుకోదు. "అబ్బా! ఎముకలు నొప్పెడుతున్నాయి. వీరంతా నలిపి పారేశారు. ఇక చాలు లేవండి. బోలెడు పని వుంది. దానికి తోడు ఈ భారం ఒకటి. చాల్చాలు లేవండి" అని తరిమేస్తుంది.

అమ్మమ్మ రెండు చేతులూ జోడించి "తల్లీ జగదాంబా! నా ప్రతిష్ట నిలబెట్టు. ఈసారయినా నా కూతురు మగ బిడ్డను ఎత్తుకునేట్టు చూడు" అని కొంగుతో కన్నీళ్ళు తుడుచుకుంటూ ప్రార్థిస్తుండేది.

రాత్రి అందరూ పడుకున్నారు. మా అక్కా చెల్లెలు ఇద్దరూ గాఢ నిద్రలో వున్నారు. గడియారం చప్పుడు తప్ప ఏమీ వినబడట్లేదు. లైట్లు తీసేయడంతో వెన్నెల గదినిండా పరుచుకుంది. అమ్మ కాళ్ళకు నూనె రాసి మర్దన చేస్తున్న తులసమ్మ "ఈసారి అబ్బాయి పుడితే నాకు చీర యివ్వాలి" అంటోంది.


"ఈసారి అబ్బాయి పుడితే ఈ పీడ శాశ్వతంగా విరగడైపోతుంది" అని అమ్మ నిట్టూర్చింది. "ఇంక ఇంటికి వెళ్ళు. మీ పిల్లలు నీ కోసం ఎదురు చూస్తూ వుంటారు. నూనె గిన్నె మంచం కింద లోపలికి పెట్టు. లేకపోతే రేప్పొద్దున వీళ్ళలో ఎవరో ఒకరు తన్నేస్తారు. మళ్ళీ..." అమ్మ వాక్యం మధ్యలో ఆపేసింది. ఏదో కీడు కాబోలు! అమ్మ వాక్యాన్ని ఎప్పుడు మధ్యలో ఆపేసినా అది గడియారం చప్పుడులా గాలిలో తేలుతున్నట్టనిపిస్తుంది. పెద్దవాళ్ళంతా మంచి విషయాలు చెప్పే టప్పుడు వాక్యాలు పూర్తి చేస్తారు కాని చెడు విషయాల్ని మాత్రం సగం చెప్పి వూరుకుంటారు. 'ఆడదాని ఖర్మ...' ముగ్గురు ఆడపిల్లలా...' అని ఆపేస్తుంటారు.

ఆకాశంలో ఒక నక్షత్రం బాగా మెరుస్తోంది. అది ధ్రువ నక్షత్రం అయ్యుండొచ్చు! ధ్రువుడు నక్షత్రంగా మారినట్టే నేనూ బాగా కష్ట పడి పనిచేస్తే ఏదైనా కావొచ్చని నాన్న అంటుండేవాడు. "అబ్బాయిని మాత్రం కాలేను గదా!" అని ఒకసారి నేను అడిగిన ప్రశ్న నాన్నకు బాగా కోపం తెప్పించింది. "పెద్ద వాళ్ళతో వాదించడం మానుకో" అని కోప్పడ్డాడు. వీళ్ళను అర్థం చేసుకోవడం చాలా కష్టం. ఈ పెద్ద వాళ్ళను ఎప్పుడూ నమ్మకూడదని, మన దగ్గర నుంచి బతిమాలో బామాలో అన్ని విషయాలూ చెప్పించేసుకుంటారు కాని వాళ్ళు మాత్రం మనకి ఒక్క విషయం కూడా చెప్పరని మా అక్క ఎప్పుడూ అంటుండేది.

నిజమే మాకు ఎవ్వరూ ఏమీ చెప్పేవారు కాదు. మేము నిద్రపోయాకే పెద్దల ప్రపంచం మేల్కొంటుంది. మెలుకువగా వుండి విందామను కుంటాను కాని ప్రతిరోజూ మధ్యలోనే నిద్రపోతాను. ఆ వినిపిస్తున్న ఏడుపు ఎవరిది? పిన్ని గొంతులా వుంది. "ఒక కుక్కకి యిచ్చే గౌరవం కూడా ఆ ఇంట్లో నాకెవరూ యివ్వరు" అని అమ్మతో చెపుతోంది. "అందరం ఆ బాధలు పడ్డవాళ్లమే. భరించక తప్పదు" అమ్మ పిన్నితో అంటోంది. నిద్ర ముంచుకొచ్చేయడంతో ఆ తర్వాత వాళ్లేం మాట్లాడుకుందీ నాకు వినబడ లేదు.

మర్నాడు పొద్దున టిఫిన్ తినేటప్పుడు అమ్మను 'భరించడం' అంటే ఏమిటని అడిగాను. ఆ పదం ఎక్కడ విన్నదీ గుర్తుచేద్దామని "పిన్ని భరించాల్సింది ఏమిటి?" అని అడిగానో లేదో అమ్మ దబదబ కొట్టేసింది. అత్తమ్మ వచ్చి అడ్డుకుని "చిన్నపిల్ల కదా పోనీయ్" అంది. "చిన్న పిల్లా అది! రాక్షసి" అమ్మ కోపంతో ఊగిపోతూ అంది. "ఎప్పుడూ ఇంతే. పెద్ద వాళ్ల మాటల్ని చాటుగా వింటూ వుంటుంది. పెద్దయ్యాక ఎలా తయారవు తుందో భగవంతుడికి తెలియాలి".

తోటలోకెళ్లాక మా అక్క కోప్పడింది. "వద్దంటే వినకుండా పెద్ద





ఫ్రాన్సిస్ కెనీని అనాథాశ్రమంలోంచి ఓ కాంపౌండర్ దత్తు తీసుకొని పెంచుకున్నాడు. కాని ఫ్రాన్సిస్ కెనీకి తన పెంపుడు తండ్రి నచ్చలేదు. ఉద్యోగం చేస్తూ స్వతంత్రంగా బతకాలనుకుని ఓ రోజు పారిపోయాడు. క్లర్కుగా, వంట వాడిగా చిన్న పనులనేకం చేస్తూ బతికాడు.

తర్వాత ఎయిర్ లైన్స్ వ్యాపారం చేసి 20 ఏళ్ళకే లక్షాధికారి అయ్యాడు. కానీ వచ్చిన సంపద వచ్చినట్లే పోయి మూడేళ్ళలో పైసా లేని నిరుపేద అయ్యాడు. తర్వాత ఫ్రాన్సిస్ ఓ ఉద్యోగంలో చేరాడు. అప్పట్లో యూనివర్సల్ పిక్చర్స్ వారు తీసే చిత్రాల నన్నింటినీ చూసేవాడు. అవి చూశాక ఆ సినిమా కథలకన్నా అద్భుతమైన కథలు రాయగలనని ఆలోచించి రచనా వ్యాసంగంలోకి దూకాడు. అతను రాసిన మొదటి నవల 'నెవ్వర్ లవ్ ఎ స్ట్రేంజర్'. అతని నవలలకు చాలా మంచి పేరు వచ్చి కోట్ల సంఖ్యలో కాపీలు అమ్ముడు పోయాయి. ఫ్రాన్సిస్ నవలల్లో ముఖ్యంగా ఇతివృత్తం ప్రేమే అయినా ఫ్రాన్సిస్ కెనీకి 40వ ఏటగానీ నిజమైన ప్రేమ స్వయంగా అనుభవంలోకి రాలేదు. ఈ వయసులోనే ఇతనికి గ్రేసీ అనే ఓ ఇటాలియన్ అమ్మాయితో పరిచయమై ప్రేమించుకుని పెళ్ళిచేసుకున్నారు.

ఫ్రాన్సిస్ కెనీకి సిరి సంపదలు కాళ్ళ దగ్గరికే వచ్చిపడుతున్నాయి. అయినా అతనికి సంతోషం లేదు. తాను అనాథనన్న భావన పోలేదు. ఎప్పటికయినా తన అసలు తల్లిదండ్రులను కనుగొనగలనన్న నమ్మకంతో జీవితాంతం అన్వేషిస్తూనే వున్నాడు. తన తల్లిదండ్రులను కనుగొనగలనన్న నమ్మకం అతనిలో చెక్కు చెదరలేదు.

ఈ ఫ్రాన్సిస్ కెనీ పేరు విన్న జ్ఞాపకం లేదనుకుంటున్నారా? ఈ రచయిత అందరికీ తెల్సిన మహానుభావుడే. ప్రపంచ పాఠకులను ఆకట్టుకున్న ప్రఖ్యాత రచయిత హెరాల్డ్ రాబిన్సే ఈ ఫ్రాన్సిస్ కెనీ. హెరాల్డ్ రాబిన్స్' అనేది ఆయన కలం పేరు.

– డి.కె. చదువులబాబు




వాళ్ళని ప్రశ్నలడుగుతూనే వున్నావు. ఇలాగే వుంటే ఒకరోజువాళ్లు నిన్ను బాగా కొట్టి పంపేస్తారు'' అని బెదిరించింది. ''నేను అడుగుతాను, అడుగుతాను, అడుగుతాను'' ఏడుస్తూ జవాబు చెప్పాను. ''అయితే చావు'' అని అక్క దేవుడికి మాల కడుతూ కూర్చుంది. అమ్మమ్మ మా దగ్గరకొచ్చి అక్కతో కావాలనే నేను వినాలన్నట్లు ''లక్ష్మీ! నా బంగారు తల్లీ'' అని గట్టిగా అంది.

మధ్యాహ్నం పూట నేను చిన్నపిల్లలకు దయ్యాలు, భూతాల కథలు చెప్పేదాన్ని. మమ్మల్ని వదిలించుకోవడానికి అమ్మ, అత్తమ్మ పిప్పరమెంటు బిళ్లలు కొనుక్కోమని డబ్బులు యిచ్చేవారు. అమ్మ, పిన్ని, అత్త, అమ్మమ్మ అంతా ఆ సమయానికి పెద్ద గదిలో చేరేవారు. ఏదో ఒకటి తింటూ కాళ్ళు బార చాపుకుని కూర్చునేవారు. లావాటి చేతులు, ముడతలు పడ్డ పొట్టలు, బట్టలు కూడా సరిగ్గా లేకుండా కబుర్లు చెప్పుకుంటుండే వాళ్ళు. మమ్మల్ని మాత్రం కాళ్ళు జాపుకుని కూర్చోవద్దంటారు దేనికో! ''మీరందరూ ఆవుల్లా వున్నారు'' అని అరిచాను కాని ఎవ్వరూ నా మాటను వినిపించుకోలేదు. కింద పడుకుని వున్న మా పిన్ని నా చేతిలోనించి పిప్పరమెంటు బిళ్ల తీసుకుని నోట్లో వేసుకుని ''బావగారి సంగతి చెప్ప నక్కరలేదు'' అంది. అందరూ పగలబడి నవ్వారు. ఎందుకు? దేనికి? అర్థంకాక చుట్టూ చూశాను కాని మమ్మల్ని పట్టించుకునే తీరిక లేదు వాళ్లకు. నేను బయటికెళ్తూ తలుపు ధఢాల్మని మూశాను. ఎందుకోగాని ఎవరూ ఏమీ తిట్టలేదు.

వాళ్లకి టీలు తీసికెళుతున్న పనిమనిషి వచ్చి ''పక్కకి తప్పుకో'' అంది. ''ఇది నీ కోసం కాదు. జరుగు'' అని మళ్లీ కూడా అంది కాని నేను కదల్లేదు. ''అమ్మాయిలు మంచివాళ్లని నువ్వంటేనే నేను కదుల్తాను'' అన్నాను. ''సరే సరే. అన్నానులే యింక జరుగు'' అంది. ''ఊహు! సరిగ్గా అనాలి'' అన్నాను.

ఇంతలో పిన్ని ''ఇంకా టీ తేలేదేమే! వచ్చే ఏటికి గాని తేవా ఏమిటి'' అని అరిచింది ''ఈ లారి రెండో కూతురు నన్ను తేనిస్తేనా ...'' అని పనిమనిషి జవాబు. ''ఈ పిల్ల దాన్ని ఏడిపిస్తున్నట్టుంది. నా జీవితాన్ని నరకం చేయడానికే యిది పుట్టినట్టుంది'' అమ్మ నన్ను తిట్టడం వినిపించింది. ఈ స్థితిలో కోపం తెచ్చుకోకూడదని అమ్మకి ఎవరో సలహా చెప్పారు.

చాలాసేపు పక్షులు ఎగరడం చూస్తూ బయట కూర్చున్నాను. తల్లి పక్షులు కూడా పిల్ల పక్షుల్ని యిలాగే హీనంగా చూస్తాయా అని ఆలోచిస్తుండి పోయాను. ఇంతలో ''ఈ పిల్ల ఎక్కడికి పోయింది?'' అంటూ ఎవరో నా కోసం వెతుక్కుంటూ రావడం కనిపించింది. గోడ వెనక నక్కి కూర్చు న్నాను. మనుషుల్ని కనపడకుండా చేసే మాయ పక్క నా దగ్గర వుంటే ఎంత సరదాగా వుండేదో!

సాయంత్రం కథ పూర్తి చేయగానే అమ్మమ్మ మమ్మల్నందర్నీ వెళ్ళి పడుకోమంది. అమ్మమ్మ ఒళ్ళు వెచ్చగా, మెత్తగా వుంటుంది కాబట్టి తన దగ్గర పడుకోవాలని నా కోరిక. పైగా అమ్మమ్మ దిండు కింద టార్చి లైటు వుంటుంది. చీకట్లో దీన్ని తన్నకుండా బాత్‌రూమ్‌కి వెళ్ళి రావొచ్చు. కాని అమ్మమ్మ ఒప్పుకోలేదు. ''అసలే వీడు నన్ను వదిలి పెట్టడం లేదు. నిన్ను ఎక్కడ పడుకోబెట్టుకోను? అమ్మ దగ్గరే పడుకో. రేపు యింకో కథ చెపుతాను, సరేనా!'' తెచ్చి పెట్టుకున్న ప్రేమతో అంది. నేను వెళ్లి పడుకోగానే ''నిన్ను పడుకో నిచ్చిందా?'' అని అక్క కోపంగా అడిగింది.

తర్వాత రోజు—

''అమ్మాయిలూ ఎక్కడ ఉన్నార్రా?'' అమ్మమ్మ కుంకుమ పళ్లెం

చేతిలో పట్టుకుని మమ్మల్ని పిలిచింది. హల్వా, పూరీలు నింపిన ప్లేట్లు తన ముందున్నాయి. ఇవ్వాళ చైత్ర శుక్ల అష్టమి. ఆడపిల్లల్ని కన్యాదేవతలుగా, కన్నె ముత్తైదువులుగా పూజించే రోజు. దేవికి నైవేద్యంగా పూరీలు, హల్వా చేశారు.'' రండి అమ్మాయిలూ బొట్టు పెడతాను. హారతి యివ్వాలి అందరూ కూర్చోండి'' అని అమ్మమ్మ పిలిచింది. నా అక్క చెల్లెళ్ళు మామయ్యగారి ముద్దుల కూతుర్లు వెళ్లి అమ్మమ్మ ముందున్న చాప మీద బాసిపీట వేసుకుని కూర్చున్నారు. ఆవిడ వాళ్లకి బొట్టు పెట్టి గంట కొట్టింది. రైల్లో గార్డు కొట్టే గంట లాగే వుంది అది. శంఖం కూడా వూదింది. హఠాత్తుగా నేను రైలింజనుగా మారిపోయి 'పూ...' అని అరుస్తూ మండువా అరుగుచుట్టూ పరిగెత్తాను. ''రండి కలకత్తా వెళ్ళే వాళ్లు టిక్కెట్లు కొనుక్కుని ఎక్కండి'' అని అరుస్తూ స్పీడ్ పెంచాను.

వెనకనించి అమ్మమ్మ ''రా తల్లీ! తిలకం పెట్టనీ, నువ్వు నా కన్యాకుమారివి కాదూ!'' అని పిలవడం వినిపిస్తోంది.

''ఊహు, నేను ఇంజన్ని'' అన్నాను. ''అరె ఇంజన్, ఇంజన్'' అని మామయ్య కొడుకు ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ అరుస్తున్నాడు.

హఠాత్తుగా మా అమ్మ చెయ్యెత్తి నావైపు రావడం కనిపించింది. భయంతో బిగుసుకు పోయాను ''ఈ క్షణంలో నిన్ను ఇంజన్‌ని చేస్తానుండు'' అని మండిపడింది. పక్కింటి మామ్మ అమ్మ చెయ్యి పట్టుకుని ఆపి ''పిచ్చి పట్టిందా లాలి నీకు?'' అని మందలించింది. చెప్పిన మాట వినమని నాకు సైగ చేస్తూ ''ఆ పిల్ల యింకా చిన్న పిల్ల. కన్నెముత్తయిదువ. ఇవ్వాళ అష్టమి. దేవీ పూజ రోజు. ఈ రోజు కన్యాకుమారిని కొట్టడం ఎంత పాపమో తెలుసా!'' అంది.

నేను అరుగు మీద నుంచి కిందకు దూకాను. అక్కడ అమ్మమ్మ ముఖం ముడుచుకుని మిగతా ఆడపిల్లలకి హల్వా పూరీ ప్రసాదం పెడు తోంది.

''ప్రసాదమైనా తిను. ఈ స్థితిలో మీ అమ్మను ఎందుకు ఏడిపిస్తావు?'' పిన్ని విసుగ్గా అంది నాతో.

''మీకు ఆడ పిల్లలంటే యిష్టం లేనప్పుడు వాళ్లని పూజిస్తున్నట్టు నటించడం దేనికి?'' కోపంతో నా గొంతు వణికింది. మండుతున్న కర్పూరాన్ని మింగేద్దామన్నంత కోపం వచ్చింది. 'ఎందుకు నటిస్తారు?' అని మళ్లీ రెట్టిద్దామనుకున్నా గాని ఏడుపొచ్చేస్తుందని భయపడి వూరుకున్నా, వాళ్ల ముందు ఏడవడం నాకు యిష్టం లేదు.

పని మనిషి బుగ్గమీద చెయ్యి పెట్టుకుని ఆశ్చర్యంగా ''అ... మ్మో ఎలా మాట్లాడుతోందో చూడు! ఆడపిల్లకు ఇంత కోపమా!'' అంది.

అమ్మమ్మ ఆడ పిల్లలందరికీ రూపాయి పావలా చొప్పున యిచ్చింది. రూపాయిలో పావలా పొట్లం కట్టి నాకు యివ్వడానికి చేయి చాపింది. ''దీంతో 20 పిప్పరమెంట్లు కొనుక్కోవచ్చు''ని గోడవైపు చూస్తూ అంది. అమ్మమ్మ బొటన వేలు మీద వున్న కుంకుమ రక్తపు మరకలా కనిపించింది నా కళ్ళకు.

వెనక్కి గోడ వైపుకి జరుగుతూ ''నాకు ఈ హల్వా పూరీ ఏమీ వద్దు. తిలకాలూ, డబ్బులూ ఏమీ వద్దు. నేను దేవతను కావాలనేమీ అనుకోవడం లేదు'' అని అరిచాను. తూటా చప్పుడుకి బెదిరి పారిపోయినట్టుగా పెరట్లో గింజలు ఏరుకుని తింటున్న పావురాలు నా గొంతుకి భయపడి ఎగిరి పోయాయి.

*(లక్ష్మీ హోమ్‌స్ట్రోమ్ సంకలనం చేసిన 'ఇన్నర్ కోర్ట్‌యార్డ్' పుస్తకం నుండి)*

# ఊరు ఊళ్ళో లేదు

ఊరు కాలిపోయింది ఉనికి మారిపోయింది
గుండెల్లో రాజుకున్న మంటలు కళ్ళను చుట్టేసాయి
ఒకే విప్పులో గదులూ హృదయాలూ
బూడిదగా చల్లారిపోయాయి
ఊళ్ళో నడవబోతే రహస్యాల్ని దిగమింగిన మౌనం
కళ్ళల్లో కాళ్ళల్లో మెలికలు తిరుగుతుంది
రగిలిన నిప్పును ఎత్తిచూపాలో వద్దో
గుప్పిట రహస్యాల్ని విప్పి చెప్పాలో వద్దో
ప్రాణం ప్రతీకారానికి గురవుతుందో ఏమో
అపశృతిని శృతిలో అందించడమెలాగో
సంశయాలు మిగిలిపోయిన మనుషుల్లో-
బూడిద మాట్లాడదు గుప్తాగ్ని మాట్లాడదు
భయం భయంగా చెదిరిన పిల్లలూ మాట్లాడరు
క్రమంగా వాతావరణం మారుతుంది
ఉడికిపోయిన సత్యాలు ఉనికి రాబోతాయి
ఒకరో ఇద్దరో గొంతు విప్పబోతారు

మాటనూ ఏడ్పునూ కలగాపులగంగా విప్పించబోతారు
వాస్తవమిక బయటికి రూపుకడుతుందనగా
వాతావరణం మళ్ళీ మారిపోతుంది
ఊరే తెలియని జెండాలు ఊళ్ళో వాల్తాయి
ఊరు భాషే తెలియని గొంతుల వివాదాలు వాల్తాయి
బండ్ల బాటల మీదుగా
ఖరీదైన వాహనాలొచ్చి హారన్లతో వాల్తాయి
మళ్ళీ ఊళ్ళో మంటలు లేస్తాయి
ఇప్పుడిక తట్టుకోలేక ఊరే వలసపోతుంది
పరాయి వాళ్ళే ఊళ్ళో ఊరి వాళ్ళలా మాట్లాడ్తారు
ఎందుకూ కొరగాని మాటలే మిగిలిపోతాయి
అంతా అదుపులో వుందని గంభీర ప్రకటనలొస్తాయి
అదుపులో వుండడానికి అసలు ఊరెక్కడుంది?
ఊరవతలి వాగులో తొక్కబడ్డ శవాలుగా
ఊరవతలి పొలాల్లో తేలుతున్న శవాలుగా
ఎక్కడెక్కడి ఊళ్ళలోనో తలదాచుకున్న క్షతగాత్రులుగా-

ఇప్పుడు ఊరు వాలకమే మారిపోయింది
ఊరు ఊళ్ళో లేదు కదా!
కొంత మాయమై కొంత వలసపోయి!

—దర్భశయనం శ్రీనివాసాచార్య